సాక్షి
వికారాబాద్

శనివారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2024



ఆగని అటవీ కబ్జాలు!

బషీరాబాద్ మండలం కొత్లాపూర్ శివారులో అటవీ భూముల కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది.

10లో▸



కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

కాంగ్రెస్‌తోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

10లో▸



శిలాఫలకం సరే..

ధారూరు మండలం నాగసమందర్‌లో ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకం వేసి వదిలేశారు.

11లో▸

న్యూస్‌రీల్

నేడు సీఎం పర్యటన

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నియోజకవర్గంలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత సిబ్బంది తెలిపారు. మద్దూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివరాజ్ కుమారుడు సతీష్, బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సిరెడ్డిలు ఈ మధ్యకాలంలో చనిపోయారు. వారి కుటుంబాలను పరామర్శించడానికి శనివారం ఉదయం 11 గంటలకు మద్దూరుకు వస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు రేగడిమైలారం వెళ్లి నర్సిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం సీఎం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారని తెలిపారు.

మత్స్య సంపద పెంచుతాం

మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకన్న



అల్లాపూర్ ప్రాజెక్టులో చేప పిల్లలు వదులుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాండూరు రూరల్: జిల్లాలో మత్స్య సంపదను పెంచుతామని మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లాపూర్ ప్రాజెక్టులో మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు అగ్గనూర్ శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో 6లక్షల చేప పిల్లలను పెంచడమే లక్ష్యమన్నారు. అల్లాపూర్ ప్రాజెక్టులో 78వేలు, యాలాల మండలం జుంటుపల్లి ప్రాజెక్టులో 1.18 లక్షల చేప పిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్నప్ప, అజ్మత్ అలీ, నాయకులు రాము యాదవ్, భీమప్ప, బంటు నర్సింలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పరశురాంరెడ్డి?



పరిగి: పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డిని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిసింది. చైర్మన్ పదవి కోసం దోమ, పూడూరు, పరిగి మండలాల నుంచి పలువురు పోటీలో ఉండగా.. పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పరశురాంరెడ్డి ఎన్నికైనట్లు సమాచారం అందుకున్న పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఏఎన్‌ఎంలకు వేతనాలు చెల్లించాలి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు వేతనాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు డీపీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పది నెలలుగా వేతనాలు అందక ఏఎన్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిపారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంబర్ సింగ్, ఏఎన్‌ఎంలు చిన్నమ్మ, సత్తిబాయి, అనిత, ప్రమీల, సంతోష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఇంకెప్పుడు?

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను యూనిఫాంల సమస్య వెంటాడుతోంది. స్కూళ్లు పునఃప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా విద్యార్థులకు ఇప్పటి వరకు ఒక్క డ్రస్ మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం సివిల్ డ్రస్‌లో పాఠశాలలకు వెళ్తున్నారు.

సగం విద్యా సంవత్సరం కావస్తున్నా ఒక జత యూనిఫామే

- జిల్లాలో మొత్తం పాఠశాలలు **1,063**
- విద్యార్థుల సంఖ్య **90,500** మంది
- కావాల్సిన యూనిఫారాలు **1,81,000**
- బయట కొనుగోలు చేస్తున్న తల్లిదండ్రులు



దోమ మండలంలో సివిల్ డ్రస్‌లో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు

వికారాబాద్: పాఠశాలల ప్రారంభానికి ముందు నుంచే అంతా సిద్ధమని ఊదరగొట్టే విద్యాశాఖ నామమాత్రపు చర్యలతో సరిపెడుతోంది. పాఠ్యపుస్తకాల పంపిణీలో ఆలస్యం చేసిన అధికారులు యూనిఫారాల విషయంలోనూ అదే ధోరణి అవలంబిస్తున్నారు. సగం విద్యా సంవత్సరం గడుస్తున్నా ఒక జత యూనిఫారమే ఇచ్చారు. రెండో జత కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. కొన్ని స్కూళ్లలో హెచ్‌ఎంలు చొరవ తీసుకొని రెండో జత ఇచ్చారు. మెజార్టీ పాఠశాలల్లో విద్యార్థులు ఒక జతతోనే నెట్టుకొస్తున్నారు. గత ఏడాది కూడా యూనిఫారాల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులకు యునిఫారాల కొనుగోలు భారంగా మారింది.

ఒక్కో విద్యార్థికి రెండు జతలు

జిల్లాలో 1,063 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 90,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫారాలను విద్యాశాఖ ఉచితంగా అందజేస్తుంది. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే యూనిఫారాల కట్టే ప్రక్రియ ప్రారంభమవుతుంది. స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున 1,81,000 దుస్తులు అవసరం కాగా ఇప్పటి వరకు ఒకే జత అందజేశారు. ఈ సారి మహిళా సంఘాలకు క్లాత్ పంపిణీ చేసి డ్రస్ కుట్టిస్తున్నారు. క్లాత్ పంపిణీలో ఆలస్యం చేయడంతోనే యూనిఫారాలు కుట్టడం ఆలస్యం అవుతోందని మహిళా సంఘాల సభ్యులు తెలిపారు.

ఎవరికి వారే యమునా తీరే..

యూనిఫారాల పంపిణీ విషయంలో ఉపాధ్యాయులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. డ్రస్‌లు ఇచ్చినా వాటిని విద్యార్థులకు ఇవ్వడం లేదు. ఒక్కో సంవత్సరం ఒక్కో రంగు యూనిఫారాలను పంపిణీ చేస్తుండటం కూడా సమస్యగా మారింది. డ్రస్సుల్లో కూడా నాణ్యత ఉండటం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఆకర్షణీయంగా ఉండే వేర్వేరు రంగుల దుస్తులను తమ పాఠశాలల యునిఫాంగా పెట్టుకుంటున్నారు. ఒక్కో ప్రభుత్వ పాఠశాలకు ఒక్కో రకం దుస్తులు ఉంటున్నాయి. ఒక జతతో ఏడాది పొడవునా స్కూల్‌కు పంపడం సాధ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు డబ్బులు చెల్లించి యూనిఫారాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయమై డీఈఓ రేణుకాదేవిని వివరణ కోరగా డ్రస్సులు కుట్టడంలో ఆలస్యం వల్ల రెండో జత యూనిఫారాలు పంపిణీ కాలేదని, త్వరలో సరఫరా చేస్తామని తెలిపారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఎస్పీ నారాయణరెడ్డి
- రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అనంతగిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల కోసం సంఘ విద్రోహక శక్తులతో పోరాడి ప్రాణాలు అర్పించారని అన్నారు. వారి త్యాగాలకు వెలకట్టలేమని పేర్కొన్నారు. రక్తదానం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడటానికి ఎంతో దోహద పడుతుందన్నారు. రక్తదానంపై అపోహలు వద్దన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసులు, యువకులు, విద్యార్థులను ఎస్పీ అభినందించారు. అంతకుముందు పట్టణంలో 3కే రన్, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం నుంచి హరిత రిసార్ట్ వరకు సాగిన ర్యాలీలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, యువకులు, విద్యార్థులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన పోలీసు అధికారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



మహిళలకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

'వుడా'తో సమగ్రాభివృద్ధి

- త్వరలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
- అప్పులతో ఆగమైన రాష్ట్రాన్ని రేవంత్ సర్కారు గాడిన పెడుతోంది
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- అర్హులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ సర్టిఫికెట్ల పంపిణీ

వికారాబాద్: 'గత సీఎం రాష్ట్రాన్ని అప్పుల పాలు జేసిండు.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన రూ.7 లక్షల కోట్లు అప్పులకు ఏడాదికి ఏడు వేల కోట్లు వడ్డీ కడుతున్నాం.. ఆగమైన తెలంగాణను రేవంత్ రెడ్డి సర్కారు గాడిలో పెడుతోంది' అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో అర్హులైన వారికి సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటికీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. వుడా(వికారాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ) ఏర్పాటుతో జిల్లా సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు సమకూరుతాయని చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావుల మాటలు చూస్తే గజినీ సినిమాలో హీరో గుర్తుకొస్తాడని ఎద్దేవా చేశారు. దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు 2017లోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇందులో భాగంగా నేవీ నుంచి రూ.135 కోట్లు తీసుకున్నది వాస్తవం కాదా.? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారని తెలిపారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల పేరిట ఆయా సామాజిక వర్గాలను విభజించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ సంప్రదాయానికి స్వస్తి పలుకుతూ రూ.170 కోట్లతో నియోజకవర్గానికే రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు, బీసీలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున ఖర్చు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గంలో 3,600 ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. తాను సీఎంను ఒప్పించి వికారాబాద్ నియోజకవర్గానికి 7వేల ఇళ్లు మంజూరు చేయించినట్లు వివరించారు. త్వరలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ఎన్నికల హామీలను కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో బెల్టు షాపులు లేని గ్రామాలను చూస్తారని అన్నారు. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కొన్ని బ్యాంకుల తప్పిదాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని వారందరికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొన్నారు.

ఆస్పత్రి పనుల పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను స్పీకర్ ప్రసాద్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయని సదరు కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్డీఓ వాసుచంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కబ్జా మయం.. ప్లాట్లు మాయం!

- ఎన్కేపల్లి సర్వే నంబర్ 86లో వెంచర్ పేరిట రియల్ దందా
- 2016లో 150మందికి 100 గజాల చొప్పున రిజిస్ట్రేషన్
- 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న 34మంది
- అధికారుల నుంచి ఫోన్ రావడంతో ప్లాట్ల వద్దకు యజమానులు
- మరో వ్యక్తి కబ్జాలో ఉండటంతో అవాక్కు
- డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు
- హైదరాబాద్ కేంద్రంగా రియల్ మోసం జరిగినట్లు వెలుగులోకి..



అధికారుల వద్ద గోడు వెల్లబోసుకుంటున్న యజమానులు

మోమిన్‌పేట: వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్ఎస్ చేసుకునేందుకు వచ్చిన యజమానులు తాము మోసపోయామని తెలుసుకొని ఆందోళనకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మోమిన్‌పేట మండలం ఎన్కేపల్లి సర్వే నంబర్ 86లో 6 ఎకరాల 3గుంటల భూమి ఉంది. 2016లో ఈ భూమిలో 100 గజాల చొప్పున 150 ప్లాట్లు వేసి విక్రయించారు. స్థలాలు కొనుగోలు చేసిన వారిలో 34మంది 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరికి పంచాయతీ కార్యదర్శి తిరుపతమ్మ ఫోన్ చేసి శుక్రవారం ఒరిజినల్ డాక్యుమెంట్లతో మీ ప్లాట్ల వద్దకు వస్తే అధికారులు పరిశీలించి రెగ్యులరైజేషన్ కోసం ప్రతిపాదనలు పంపుతారని సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఉదయం కొనుగోలు చేసిన ప్లాట్ల వద్దకు వచ్చారు. ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ అధికారులు వచ్చారు. స్థలం చుట్టూ ప్రీ కాస్ట్ కంచె, గేటుకు తాళం ఉండటాన్ని చూసి ప్లాట్ల యజమానులు ఖంగుతిన్నారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగిందంటే..

ఎన్కేపల్లి సర్వే నంబర్ 86లో 6 ఎకరాల 3గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన బద్రొద్దీన్ 2016లో కొనుగోలు చేసి ఫరహా బెగంకు జీపీఏ చేశాడు. ఆమె ఈ భూమిలో వెంచర్ వేస్తున్నట్లు పేపర్‌పై లేఅవుట్ తయారు చేసి రియల్ మోసానికి తెరతీసినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని మధ్యతరగతి వారిని టార్గెట్ చేసుకొని రియల్ దందా కొనసాగించారు. 100 గజాల ప్లాట్ కేవలం రూ.3.60 లక్షలకే వస్తుందని ఆశ పెట్టారు. దీంతో చాలా మంది స్థలం చూడకుండానే డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. అప్పట్లో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి ఖాళీ భూమిని చూపించి ఇక్కడే ప్లాట్లు వేస్తామని నమ్మబలికారు. ఆపై రిజిస్ట్రేషన్ చేయించారు.



ఎన్కేపల్లిలో ప్లాట్ల చుట్టూ వేసిన ప్రీకాస్ట్ కంచె

2020లో ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించిన నేపథ్యంలో 150మందిలో 34మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి గ్రామ కార్యదర్శి నుంచి ఫోన్ వెళ్లడం.. వారు రిజిస్ట్రేషన్ పత్రాలతో ప్లాట్ల వద్దకు రావడం.. తాము మోసపోయినట్లు తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన అశోక్ సింగ్ ఈ భూమి తనదేనని స్థలం చుట్టూ ప్రీకాస్ట్ కంచె వేసి గేటుకు తాళం వేసుకున్నాడు. ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ.. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

అప్పు చేసి ప్లాటు కొన్నా



హైదరాబాద్‌కు దగ్గర్లో ఉంటుందని ఇక్కడ ప్లాటు కొనుగోలు చేశా. బ్రోకర్ల మాటలు నమ్మి అప్పు చేసి స్థలం కొన్నా. రిజిస్ట్రేషన్ తర్వాత రెండు సార్లు ఇక్కడికి వచ్చి చూశా.. కానీ ప్లాటింగ్ చేయలేదు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేశా. అధికారులు ఫోన్ చేయడంతో ఇక్కడికి వచ్చా. తాము కొనుగోలు చేసిన స్థలం చుట్టూ ప్రీకాస్ట్ కంచె వేసి ఉంది. దీంతో ఏం చేయాలో తెలియక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశా. మాకు న్యాయం చేయాలి.

– సిద్దప్ప, ప్లాటు కొనుగోలుదారుడు, హైదరాబాద్

రెండు ప్లాట్లు కొనుగోలు చేశా




ఎప్పుడైనా అవసరానికి వస్తాయని రెండు ప్లాట్లు కొనుగోలు చేశా. ఇందు కోసం రూ.7లక్షలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. ఇప్పుడు వచ్చి చూస్తే మా స్థలాన్ని ఎవరో కబ్జా చేశారు. కబ్జా నుంచి విడిపించి తమకు న్యాయం చేయాలి.

– రాజేష్, ప్లాటు కొనుగోలుదారుడు, హైదరాబాద్



కమ్మేసిన పొగమంచు

ధారూరు మండలంలో శుక్రవారం ఉదయం పొగమంచు వ్యాపించింది. తాండూరు – వికారాబాద్ ప్రధాన రహదారి కనిపించకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకొని వెళ్లాల్సి వచ్చింది. పొగమంచు కారణంగా కంది పంటకు చీడపీడలు వ్యాప్తించే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. – ధారూరు



చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు



చౌదర్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపడుతున్న అధికారులు

యాచారం: ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం జారీలో తీవ్ర వేధింపులకు పాల్పడి, ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారకురాలైన చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆమె స్థానంలో గునుగల్ కార్యదర్శి శోభకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం డీఎల్‌పీఓ సాధన విచారణ చేపట్టారు. చౌదర్‌పల్లి పంచాయతీ కార్యాలయానికి వచ్చిన డీఎల్‌పీఓకు స్థానికులు ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకోనిదే ఆమె ఏ పనీ చేయదని ఆరోపించారు. చస్తే నేగానీ ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వారా అంటూ మండిపడ్డారు. అనంతరం డీఎల్‌పీఓ సాధన పంచాయతీ అధికారి శ్రీలతతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసిన మధుసూదన్ ఇంటికెళ్లి కొలతలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నపై వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

క్లుప్తంగా

27న స్వేరోస్ నేషనల్ కాన్ఫరెన్స్

రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



పరిగి: ఈ నెల 27న నిర్వహించే స్వేరోస్ నేషనల్ కాన్ఫరెన్స్ ను విజయవంతం చేయాలని స్వేరోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకిలోని సత్య అర్జున గార్డెన్ నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. స్వేరోస్ సంస్థను 2012న ఏర్పాటు చేసి ఎన్నో విజయాలను సాధించామన్నారు.

అనుమతుల్లేకుండా పాఠశాల నడిపితే చర్యలు

ఎంఈఓ గోపాల్



పాఠశాల సిబ్బందికి నోటీసు అందజేస్తున్న ఎంఈఓ

పరిగి: ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మండల విద్యాధికారి గోపాల్ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని లిటిల్‌బడ్డి ప్రైవేట్ పాఠశాల ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతుండటంతో శుక్రవారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి నోటీసు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధ్రువపత్రాలు సమర్పించకుండా ఎలా పాఠశాలను నడుపుతారన్నారు. కనీసం ఓపెన్ పర్మిషన్ లేకుండా నడపడం దారుణమన్నారు. అన్ని ధ్రువపత్రాలు మూడు రోజుల్లో సమర్పించాలని నోటీసు అందజేశామన్నారు. ఒకవేళ సమర్పించకపోతే జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ ధర్నాలో పాల్గొన్న నేతలు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో స్థానిక బీజేపీ నాయకులు

చేవెళ్ల: మూసీ పునరుద్ధరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నగరంలో బీజేపీ చేపట్టిన మహాధర్నాలో చేవెళ్ల నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం నగరంలోని మూసీ, హైడ్రా బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని చేపట్టిన ధర్నాకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్‌తో కలిసి భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, జయసింహ, ఇంద్రాసేనా రెడ్డి, త్రినేత్ర, ఆనంద్, సందీప్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కుర్మల్‌గూడ తిరుమల నగర్‌లో నివాసం ఉండే పోల్ కృష్ణ కుటుంబ సభ్యులు ఈ నెల 16న ఇంటి నుంచి జిల్లెలగూడకు వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చారు. వారు వచ్చి చూసే వరకు తాళం పగలగొట్టి ఉండటం, బీరువా తెరిచి ఉండడం గమనించారు. బీరువాలోని రెండు తులాల బంగారం (నల్లపూసలు ,ముక్కుపుడక) ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగని అటవీ కబ్జాలు!

- కొత్లాపూర్ ఫారెస్టులో చెట్ల నరికివేత
- అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు
- చెట్లు నరికిన వారిని గుర్తించే పనిలో సిబ్బంది



కొత్లాపూర్ అటవీ భూముల్లో చెట్లు నరికి కబ్జాకు యత్నించిన భూమి

బషీరాబాద్: అటవీ భూముల కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. కన్నడ రైతులు 400 ఎకరాలకు పైగా కబ్జా చేసి సాగుచేస్తుండగా వీటిపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇదిలా ఉండగా స్థానికులు సైతం రోజుకో ప్రాంతంలో భూ కబ్జాకు యత్నిస్తూనే ఉన్నారు. ఈ నెల 2న మండల పరిధిలో నలి గొట్టిగకలాన్‌లో అటవీ భూమి కబ్జాకు యత్నించిన రైతును గుర్తించి జరిమానా వేసి విడిచిపెట్టారు. తాజాగా కొత్లాపూర్ శివారులో ఎనిమిది ఎకరాల్లో అదే గ్రామానికి చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెట్లు నరికి సాగుకు యత్నించడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం తాండూరు ఎఫ్ఆర్ఓ శ్రీదేవి, సెక్షన్ అధికారి స్నేహశ్రీ తమ సిబ్బందితో కలిసి సర్వేనంబర్ 40లో చెట్లు నరికివేసినట్లు గుర్తించారు. దీంతో అధికారులు పశువుల కాపర్లను, చుట్టుపక్కల పొలాల రైతులను పిలిచి ప్రశ్నించారు. పక్కపొలాల రైతులే ఇలాంటి కబ్జాలకు యత్నిస్తారని అనుమానిస్తున్నారు. చెట్లు నరికిన వా రిలో గ్రామానికి చెందిన వ్యక్తులు పదుల సంఖ్యలో ఉ న్నట్లు అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది. అధికారులు వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

చెట్లు నరికిన వారిపై క్రిమినల్ కేసులు



అటవీ భూముల్లో చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అడవుల్లో నిరంతర నిఘా పెడుతున్నాం. బీట్ అధికారులు తిరుగుతున్నారు. అటవీ భూముల సరిహద్దు గ్రామాల ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా అటవీ భూముల కబ్జాలను అడ్డుకోవాలి. ఇలాంటి ఘటనలపై ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. కొత్లాపూర్‌లో చెట్లు నరికిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– శ్రీదేవి, ఎఫ్ఆర్ఓ

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పూడూరు: పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కెరవెళ్లి , దేవనోనిగూడ గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామ పంచాయతీకి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరం ఉన్నచోట సీసీ రోడ్డు, డ్రైనేజీ , తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, రఘునాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, అజీంపటేల్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ షరీఫ్

పరిగి: పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఉత్సవాలు మతసామరస్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ప్రతీ సంవత్సరం మతాలకతీతంగా ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి ఆదాయం ఘణనీయంగా పెరిగిందన్నారు. ఎన్నికల్లో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశల వారీగా అమలుచేస్తుందన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, డీఎం కరుణశ్రీ, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కృత్రిమ మేధస్సుదే..

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్



మాట్లాడుతున్న స్వప్నాపరిమళ్

తాండూరు టౌన్: భవిష్యత్‌లో కృత్రిమ మేధస్సుదే కీలక పాత్ర అని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమెన్ ఇన్ డాటా ప్రోగ్రాం శిక్షణ శిబిరం ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో సాంకేతిక విప్లవం కొనసాగుతోందని.. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దూసుకొస్తోందన్నారు. మహిళా సాధికారతలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు కృత్రిమ మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానంపై 20 గంటల పాటు శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండాలని, కృత్రిమ మేధస్సు విభాగంలో ఉద్యోగావకాశాలు చేజిక్కించుకోవాలని సూచించారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థినులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆధునిక ప్రపంచంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను పరిశీలిస్తూ వాటిని సాధించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ జి.సంజీవులు, కో ఆర్డినేటర్ కళావతి, అధ్యాపకులు విశాల, సత్యలక్ష్మి, మమత, షరీఫా, కిషన్, మహేందర్ రెడ్డి, సంగమేశ్వర్, కృపాకర్ రెడ్డి, లక్ష్మణ్, 118 మంది డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు శుభ్రం చేయాలి

వాటర్‌మెన్‌ల శిక్షణ కార్యక్రమంలో డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శంకర్ నాయక్

తాండూరు రూరల్: ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్ ఆధ్వర్యంలో 33 గ్రామాల మిషన్ భగీరథ వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. గ్రామస్తులకు తాగునీరు అందించడంలో వాటర్‌మెన్‌లే కీలకమన్నారు. ప్రజలకు క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలని సూచించారు. అనంతరం మోటారు మరమ్మతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిపై ప్రజాల్లోని అపోహలు తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగిరథ గ్రిడ్ ఏఈ ప్రతిభ, ఎంపీఓ ఆనంద్‌రావు, వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి అనుమతించండి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ బోర్డును ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో, రాష్ట్రం విడిపోయిన తర్వాత తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు అంగీకరించి భక్తులకు దర్శనానికి అనుమతించే వారని అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను టీటీడీ బోర్డు తిరస్కరిస్తోందని.. వాటిని అనుమతించి దర్శనం కల్పించాలని కోరారు. తెలంగాణలోని భద్రాచలం, యాదగిరిగుట్ట తదితర పుణ్యక్షేత్రాల్లో ఏపీ ప్రజాప్రతినిధులకు ప్రాముఖ్యత ఇచ్చి గౌరవిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో పనుల పరిశీలన

కోకట్ గ్రామాన్ని సందర్శించిన అధికారుల బృందం



కోకట్ గ్రామంలో పర్యటిస్తున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్లు

యాలాల: మండల పరిధిలోని కోకట్ పంచాయతీని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్లు రవీందర్, జాన్ వెస్లీల బృందం శుక్రవారం సందర్శించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డుకు పోటీలో ఉన్న కోకట్ గ్రామాన్ని వివిధ అంశాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామీణ పేదరిక నిర్మూలనలో భాగంగా స్వయం సహాయక బృందాల పనితీరు, లబ్ధి పొందుతున్న మహిళల అభిప్రాయాలను అధికారుల బృందం అడిగి తెలుసుకుంది. జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీ ఎంపికలో భాగంగా ఉండే ఏడు అంశాల్లో శానిటరీ, మొక్కల పెంపకం, ఉపాధి హామీ, ఇంకుడు గుంతల నిర్వహణ, పంచాయతీ రికార్డుల నిర్వాహణ తదితర అంశాల్లో భాగంగా వివరాలను ఆరా తీశారు. అనంతరం స్వయం సహాయక బృందంలో పచ్చళ్ల నిర్వాహణ చేపడుతున్న కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీపీఓ సంధ్యారాణి, డీఎల్‌పీఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఏపీఓ జనార్ధన్ తదితరులు ఉన్నారు.

పొలాల్లో అడవి పందుల కళేబరాలు

ఆందోళనలో రైతులు



అంగడిరాయిచూర్‌లో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు



పొలంలో అడవిపంది కళేబరం

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అంగడిరాయిచూర్ శివారులో అడవిపందుల కళేబరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామానికి చెందిన పెద్ద బుగ్గప్ప, సాయన్న పొలాల్లో శుక్రవారం అడవిపందుల కళేబరాలు కనిపించాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ సిబ్బంది సంబంధిత రైతుల పొలాలకు వెళ్లి పరిశీలించారు. అడవి పందుల కళేబరాలను, పరిసరాలను పరిశీలించారు. పులి జాడలు లేవని.. హైనా కావచ్చని సెక్షన్ ఆఫీసర్ రతన్‌సింగ్ తెలిపారు. రైతులు జాగ్రత్తగా మసలుకోవాలని సూచించారు.

మత్స్యకార్మికుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



జుంటుపల్లి ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న బాల్‌రెడ్డి తదితరులు

తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి

యాలాల: మత్స్యకార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని జుంటుపల్లి ప్రాజెక్టులో మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షుడు పనిమోని శ్రీధర్‌తో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్స్య శాఖ ఆధ్వర్యంలో జుంటుపల్లి ప్రాజెక్టులో 1.18 లక్షల చేప పిల్లలను వదిలామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ సర్కారు పేద, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడతోందన్నారు. మత్స్య కార్మికులతో పాటు అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీఏ వెంకయ్య, ఎఫ్‌డీఓ సౌజన్య, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మేకల రాజు, మాజీ సర్పంచ్ హన్మంతు, కుర్వ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్తకు రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్‌కుమార్ చిత్రంలో నిందితుడు శ్రీకాంత్

తాండూరు టౌన్: భార్యను హతమార్చిన వ్యక్తిని శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన మ్యాతరి శ్రీకాంత్ భార్య సుజాత(23) కూతురుతో కలిసి పాత తాండూరులోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్యపై అనుమానం ఉన్న శ్రీకాంత్ గురువారం పాయిల కట్టెతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసి పోలీసులకు లొంగిపోయిన విషయం విదితమే. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు హాజరవ్వండి

మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డికి ఆహ్వానం



పెద్దేముల్: మహేందర్‌రెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న రాఘువేందర్‌రెడ్డి

తాండూరు: వచ్చే నెల 7న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని తాండూరు బిగ్ బాస్ లీగ్ సెషన్ వారు ఆహ్వానించారు. శుక్రవారం నియోజకవర్గంలో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. తాండూరు పట్టణంతో పాటుగా యాలాల, పెద్దేముల్ మండలాల్లో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. పట్టణానికి చెందిన హోంగార్డు లింగం(లింగయ్య) మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ రామకృష్ణ, యాలాల మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్, నాయకులు రఘు, రాజశేఖర్ తదితరులున్నారు.

మాజీ మంత్రికి సన్మానం

పెద్దేముల్: మండల కేంద్రంలో శుక్రవారం మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా పలువురు అనుచరుల నివాసాలకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి బాగోగులను తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ కిషన్‌రావు, సీనియర్ నాయకుడు చిట్టిపు ప్రకాశ్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు ఆజం ఖాన్ నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మాజీ వార్డు సభ్యుడు నర్సింలు కుమారుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భగా పలువురు నాయకులు కిషన్‌రావు, చిట్టిపు రాఘుందర్‌రెడ్డి, ఆజం ఖాన్‌సాబ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేష్, రవి, నయీం తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, పెద్దేముల్ మండల నాయకులు సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్, డాక్టర్ రమేష్‌కుమార్, కోటపల్లి మాజీ సర్పంచ్ శివానందం, పలువురు నాయకులున్నారు.

లగచర్లలో ఉద్రిక్తత

- పోలీసులు, గిరిజనుల మధ్య తోపులాట
- పలువురికి గాయాలు



పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



పోలీసుల లాఠీచార్జ్‌లో సొమ్మసిల్లిన మహిళ

కొడంగల్, దుద్యాల్: దుద్యాల్ మండల పరిధిలోని లగచర్ల, రోటిబండతండాలో శుక్రవారం ఏర్పాటు ప్రజాభిప్రాయ సేకరణ అనూహ్యంగా ఆగిపోయింది. సమావేశానికి ముందే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తమను దూషించాడంటూ గిరిజనులు మండిపడ్డారు. ఆయనపై దాడికి యతిన్చంగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్థానికులు, పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇదిలా ఉండగా ఫార్మాకు భూములు ఇచ్చేది లేదని లగచర్ల, రోటిబండతండా రైతులు తెలిపారు. ఫార్మా పేరుతో తమ గ్రామాలను ఖాళీ చేయించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వీ వాంట్ జస్టిస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్పీ నారాయణరెడ్డి ఆందోళనకారులను సముదాయించారు. ఇరు గ్రామాల్లో నెలకొన్న ఉద్రిక్తతతల నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ అర్ధంతరంగా ఆగిపోయింది.



గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు



గ్రామంలో మోహరించిన పోలీసులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయనకు శుక్రవారం పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు చేపడుతున్నారని చెప్పారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నిక కావడం శుభపరిణామమని అన్నారు. మంత్రిని కలిసినవారిలో చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, అగ్గనూరు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, వన్నాడ ప్రకాష్, పురుషోత్తం, సుదర్శన్ తదితరులు ఉన్నారు.